కాలనీ అభివృద్ధికి మోక్షమెప్పుడో?

- 24 ఏళ్లక్రితం బీసీ కాలనీకి స్థలం మంజూరు
- దశాబ్దాలు గడుస్తున్నా సౌకర్యాలు కరువు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్లాట్ల లబ్ధిదారులు


చిట్టడివిని తలపిస్తున్న బీసీ కాలనీకి కేటాయించిన స్థలం

అయిజ: నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసి బీసీ కాలనీకి ఇళ్లపట్టాలు అందజేసింది. 2001 జనవరి 26న అప్పటి ఎమ్మెల్యే గట్టు భీముడు హయాంలో రెవెన్యూ అధికారులు అయిజ పట్టణంలోని ఎక్లాస్‌పురం రోడ్డు పక్కన 9–15లో సర్వే నంబర్లలో 450 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. పట్టాలైతే ఇచ్చారు గానీ కాలనీలో నేటి వరకు సీసీరోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాలు, నీటి వసతి ఏర్పాటు చేయలేదు. దీంతో ఇళ్లు నిర్మించుకోలేక లబ్ధిదారులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మౌలిక వసతులు కల్పించాలని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు(ఫైల్)

దట్టంగా ముళ్లపొదలు

ప్రభుత్వం కేటాయించిన బీసీ కాలనీకి కేటాయించిన స్థలంలో కనీస వసతులు కల్పించకపోవడంతో స్థలం చిట్టడవిని తలపిస్తోంది. దట్టంగా ముళ్లపొదలు పెరిగి విషసర్పాలకు, పశువులకు ఆవాసంగా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా కాలనీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రభుత్వం నిరుపేదలకు నివాస పట్టాలు ఇచ్చిన ప్పటి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాదిలో ప్లాట్లకు సంబంధించిన హద్దురాళ్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల్లో కొంత మంది ఇప్పటికే మృతి చెందారని, వారికి కేటాయించిన ప్లాట్లను వేరే వారికి కేటాయించి వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. గత నెలలో కలెక్టర్ బీఎం సంతోష్‌కు కాలనీలో మౌలిక వసతుల కల్పనకు వినతిపత్రాలు అందజేసినా ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం బీజేపీ నాయకులు కాలనీకి కేటాయించిన స్థలంలో మౌలిక వసతులు కల్పించాలని ఆందోళన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.

వసతులు కల్పించలేదు



మాకు 24 సంవత్సరాల క్రితం ప్రభుత్వ పట్టాలిచ్చింది. ఇప్పటి వరకు కాలనీకి కేటాయించిన స్థలంలో మౌలిక వసతులు కల్పించ లేదు. ప్లాట్లు మంజూరు చేసిన స్థలంలో ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. సీసీరోడ్లు, డ్రైనేజీలు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి.

- వెంకటేష్, అయిజ

నిరుపయోగంగా మారింది



ప్రభుత్వం బీసీ కాలనీకి కేటాయించిన స్థలం నిరుపయోగంగా మారింది. లబ్ధిదారులకు మంజూరు చేసిన ప్లాట్లలో ముళ్లపొదలు అలుముకోవడంతో ఎవరి ప్లాటు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- బాషా, అయిజ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ప్రభుత్వం బీసీ కాలనీకి కేటాయించిన స్థలంలో గతంలో ముళ్లపొదలు తొలగించినా మళ్లీ దట్టంగా పెరిగాయి. లబ్ధిదారులే వాటిని తొలగించుకోవాలని సూచించాం. నిధులు లేక అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

- సైదులు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

వీధికుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

మానవపాడు: మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామంలో శంకరన్న అనే వ్యక్తి ఆదివారం వీధికుక్క దాడిలో గాయపడ్డాడు. ఇంటికి వస్తున్న క్రమంలో కుక్కదాడి గాయపరిచినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించినట్లు పేర్కొన్నారు.

తైక్వాండో బెల్టుల ప్రదానం



అయిజ: మండల కేంద్రంలోని బ్రైట్‌స్టార్ పాఠశాలలో తైక్వాండో విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఆదివారం రాష్ట్ర తైక్వాండో జనరల్ సెక్రటరీ మాస్టర్ శ్రీహరి, జిల్లా ప్రెసిడెంట్ శేక్షావలి ఆచారి ఆధ్వర్యంలో విద్యార్థులకు తైక్వాండో పరీక్షలు నిర్వహించి బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్లు నవదీప్‌సాగర్, రమేష్, అంజి, వెంకటేష్, సాయి, పాఠశాల కరస్పాండెంట్ ఎస్తేర తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం



మల్దకల్: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో ప్రైవేటు వాహనదారులు చెలగాటమాడుతున్నారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి కూలీలను దాదాపు 15 నుంచి 30 మందికి పైగా తరలిస్తున్నట్లు కూలీలు వాపోతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

భగవద్గీతపై మక్కువ పెంచాలి



ఉండవెల్లి: చిన్నారులకు భగవద్గీతపై మక్కువ పెంచాలని హనుమాన్ భక్త బృంద సభ్యులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో భగవద్గీత బోధనలను చిన్నారులకు ఇస్కాన్ ప్రభూజీ వినిపించారు. చిన్నారులు ఫోన్, సోషల్ మీడియాకు అట్రాక్ట్ కాకుండా భగవద్గీతపై మక్కువ పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమాన్ భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మహాగర్జన'ను జయప్రదం చేయాలి

ధరూరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టు 13న హైదరాబాద్‌లో జరిగే దివ్యాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని మండల దివ్యాంగుల సంఘం నాయకులు ఆంజనేయులు, భీమన్న, పద్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రూ.4,016 ఉన్న దివ్యాంగుల ఫించన్‌ను రూ.6,016కు పెంచాలని, అలాగే రూ. 2,016 ఉన్న వితంతు ఫించన్‌ను రూ.4,016కు పెంచాలని డిమాండ్ చేశారు. అధిక సంఖ్యలో మహాగర్జనను హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'కుల నిర్మూలన చట్టాలు అమలు చేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కుల నిర్మూలన చట్టాలను అమలు చేయాలని హెచ్‌సీయూ ప్రొఫెసర్ కె.వై.రత్నం అన్నారు. ఆదివారం తెలంగాణ చౌరస్తాలోని రెడ్‌క్రాస్ సొసైటీ హాల్‌లో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి (కేఏఎస్‌పీఎస్) రాష్ట్ర రెండో మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగం కంటే కులానికే ఎక్కువ ప్రాధన్యమిస్తున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కుల నిర్మూలన, సమసమాజం ఏర్పాటు విద్యతోనే సాధ్యమన్నారు. అనంతరం రాష్ట్ర కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గన్నారపు సరోజన (వరంగల్), ప్రధాన కార్యదర్శిగా ఈరపాగ గోవిందు (వనపర్తి), కోశాధికారిగా ఎర్ర మోహనకృష్ణ (కేవీ రంగారెడ్డి)తోపాటు ఇతర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కేఏఎస్‌పీఎస్ అఖిల భారత కన్వీనర్ బండారి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, ఓయూ ప్రొఫెసర్లు వెంకటదాసు శ్రీశోభ, స్వామిదాసు, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి, రచయిత ఇంద్రవెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెజార్టీ స్థానాల్లో గెలుపు తథ్యం


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీ స్థానాల్లో గెలుపు తథ్యమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సింధనూరు గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్రారెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు స్థానిక ఎన్నికల్లో గెలుపొందేందుకు దోహదపడుతాయన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, ఆంజేయులు, గిడ్డన్న, ప్రదీప్‌కుమార్, నరసింహులు, గోపాల్, మల్లేష్, నరసన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరించండి


గ్రంథాలయ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

గద్వాల: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌ఎస్వీ నాయకులు కుర్వపల్లయ్య రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం పట్టణానికి వచ్చిన రియాజ్‌ను కలిసిన బీఆర్‌ఎస్వీ నాయకులు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ దుస్థితిపై వివరించారు. వివిధ రకాల పోటీ పరీక్షలకు అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారన్నారు. గ్రంథాయలంలో కనీస వసతులు లేక అభ్యర్థులు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా కాంపిటేటివ్‌కు అవసరమైన మ్యాగజైన్స్ కూడ రావడం లేదన్నారు. గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. డ్రెయినేజీ మరిచారు!


కుర్వ వీధిలో సీసీరోడ్డుపై పారుతున్న మురుగు


సవారమ్మ ఆలయ సమీపంలో సీసీరోడ్డుపై నిలిచిన మురుగు

ధరూరు: మండల కేంద్రంలోని కర్వ వీధిలో గతేడాది సీసీరోడ్డు వేసిన అధికారులు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించడం మరిచారు. దీంతో కాలనీలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్లపై పారుతూ ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు వాపోతున్నారు. ప్రత్యేక అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు 'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ

అలంపూర్/మల్దకల్/గట్టు/మానవపాడు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 208 మంది లబ్ధిదారులను మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

- గట్టు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 137 మంది లబ్ధిదారులకు గద్వాలలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.
- అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఉన్నట్లు క్యాంపు కార్యాలయం ప్రకటనలో తెలిపింది.
- మానవపాడు మండలంలోని 20 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేయనున్నట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

బోనాల పండుగకు పకడ్బందీగా ఏర్పాట్లు



అమరచింత: ఈనెల 22న అమరచింతలో పోచమ్మతల్లి బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహణపై కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో ప్రతి సంవత్సరం పట్టణంలో పోచమ్మ దేవతకు బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకుంటామన్నారు. ఈ సంవత్సరం కూడా యథావిధిగా బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో రమేశ్, గోపాల్, మేస్త్రీ రాములు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్య


ఆత్మకూర్‌లో సైన్స్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: గ్రామీణ ప్రాంతాల్లో సైతం సీబీఎస్‌ఈ విద్యను అందిస్తుండడం అభినందనీయమని విద్యార్థులు దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని రాష్ట్ర పశువర్ధక, క్రీడలు, యువజన, మత్స్యశాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని ఎంవీ రామన్ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ప్రియవర్ష సైన్స్ ల్యాబ్‌ను మంత్రి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. రూ.10కోట్ల వ్యయంతో అత్యాధునికంగా సైన్స్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పోటీ ప్రపంచానికి తగినట్లుగా విద్యార్థులకు కావల్సిన సౌకర్యాలను ఒకేచోట సమకూర్చడం అభినందనీయమన్నారు. అలాగే రాష్ట్ర ఐజీ మస్తిపూర్ రమేశ్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్మన్ స్వర్ణమ్మ, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీతపారిశ్రామిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్, బీజేపీ రాష్ట్రనాయకుడు కొండయ్య, బంగ్ల లక్ష్మికాంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ప్రసంగించి డైరక్టర్ శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సీశ్రీధర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, అఖిలపక్షం పార్టీల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత..

ఆత్మకూర్ మండలంలోని గుంటిపల్లి గ్రామానికి చెందిన రాములుకి వైద్యఖర్చుల నిమిత్తం రూ.5లక్షల ఎల్‌ఓసీని మంత్రి శ్రీహరి అందజేసారు. అలాగే పిరమిడ్ ధ్యానకేంద్రంలో ధ్యానులతో సమావేశమై స్థల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, అయ్యూబ్‌ఖాన్, రహ్మతుల్లా పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి

మదనాపురం: మండలంలోని గోపన్‌పేట గ్రామంలో మంత్రి వాకిటి శ్రీహరి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్ సంఘం గ్రామస్థుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు


కేటీదొడ్డిలో రోడ్డుపై కుక్కల గుంపు


జింకలపల్లి స్టేజిలో..

ఇటిక్యాల/అయిజ/కేటీదొడ్డి: మండలాల పరిధిలోని గ్రామాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నారు. గ్రామాల్లో చిన్నా పెద్దలపై ఇష్టానుసారంగా దాడి చేసి గాయపరుస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇటిక్యాల మండల పరిధిలో 2024 సంవత్సరంలో 185 మంది కుక్కకాటుకు గురయ్యారు. వీధికుక్కలు దాడులతో బెంబేలెత్తిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'16న రాయల చంద్రశేఖర్ వర్ధంతి'


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

అమరచింత: ఇల్లందులో ఈనెల 16న రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కోశాధికారి రాజు కోరారు. మండలకేంద్రంలోని మార్క్స్ భవనంలో ఆదివారం చంద్రశేఖర్ వర్ధంతి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నమ్మిన విప్లవ సిద్ధాంతాల కోసం శ్రమిస్తూ నిరంతరం పేదప్రజల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తూ గతేడాది చంద్రశేఖర్ అకాల మృతి చెందాడన్నారు. సభకు ముఖ్యఅతిథిగా ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో రాజన్న, సామెలు, మాస్లామని, కురుమన్న, ప్రేమరత్నం పాల్గొన్నారు.

మున్సిపల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రం వద్ద ఆదివారం వర్కర్ల సమావేశం నిర్వహించి మణికంట మున్సిపల్ అసోసియేషన్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ అయూబ్, గౌరవ అధ్యక్షుడు జీవి భగవంతు, ఉపాధ్యక్షులు జి బక్కన్న ,జి బాలయ్య, ప్రధాన కార్యదర్శులు ఎం గంగన్న, కోశాధికారి రాజు, మీడియా కన్వీనర్ దిలీప్, ప్రచార కార్యదర్శిలు డి కృష్ణ, శేఖర్, జయశ్రీ, సహాయ కార్యదర్శులు రంజిత్‌కుమార్, భాస్కర్, ఈశ్వర్, ఈశ్వరమ్మ,తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. అధ్యక్షుడిగా ఎన్నుకున్నందు మున్సిపల్ వర్కర్లకు, కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి తగదు

గోపాల్‌పేట: తీన్మార్‌మల్లన్న కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా యువజన కాంగ్రెస్ ఆర్టీఐ చైర్మన్ కొంకిరమేశ్ అన్నారు. ఆదివారం వారు బీఆర్ఎస్ జనజాగృతికి చెందిన నాయకులు మల్లన్న ఆఫీసుపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఏదైనా తప్పుగా మాట్లాడి ఉంటే చట్టపరంగా ముందుకెళ్లాలన్నారు. తక్షణమే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ రోడ్లపై ప్రయాణమెలా?


కంకరవేసి వదిలేసిన మాన్‌దొడ్డి- రాజోళి రోడ్డు

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు అధ్వాన్న స్థితిలో ఉన్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి మాన్‌దొడ్డి, పచ్చర్ల, పెద్దధన్వాడ, చిన్నధన్వాడ, నసనూరు గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకతేలి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆరేళ్లుగా మండల కేంద్రానికి వచ్చే రోడ్లకు మరమ్మతు చేపట్టకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి శాంతినగర్‌కు చేరుకునేందుకు కూడా రోడ్డు సక్రమంగా లేదని వాహనదారులు వాపోతున్నారు. వర్షాకాలంలో బురద, రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొంటున్నారు.

మరమ్మతుకు నోచుకోని రహదారి

అయిజ: పట్టణ సమీపంలోని కర్నూలు వైపు వెళ్లే రోడ్డు శిథిలమై ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోవడం లేదు. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూచిక బోర్డులు కరువు

ఇటిక్యాల: జాతీయ రహదారి నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మలుపులలో ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. కనీసం సూచిక బోర్డులు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ గోడలేని కల్వర్టులు

ధరూరు: గద్వాల- రాయచూర్ మార్గంలో కల్వర్టులు ప్రమాదభరితంగా ఉన్నాయి. ధరూరు నుంచి జాంపల్లి వెళ్లే దారిలో ఈదమ్మమిట్ట (ఎర్రమట్టి గుంతల) వద్ద ఉన్న కల్వర్టు కూలి ఏళ్లు గడిచినా పట్టించుకునే వారు కరువయ్యారని వాహనదారులు పేర్కొన్నారు. కనీసం రక్షణ గోడ కూడా ఏర్పాటు చేయలేదని వాపోతున్నారు. ముళ్లపొదలు దట్టంగా పెరగడంతో కల్వర్టు సైతం కనిపించడం లేదని పేర్కొన్నారు. జాంపల్లి– కోతులగిద్ద స్టేజీ మధ్య ఉన్న కల్వర్టు ఇటీవల ఓ మట్టి టిప్పర్ ఢీకొని కూలినట్లు తెలిపారు. ప్రమాదం పొంచి ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి మలుపుల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, శిథిల రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


అయిజలో సమీపంలో శిథిలమైన బీటీ రోడ్డు


గద్వాల- రాయచూర్ రోడ్డులో ప్రమాదభరితంగా కల్వర్టు


ఇటిక్యాల రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మలుపు